లేదని తోచిం దతనికి. ఆమెకి ప్రాపంచిక సౌఖ్యాలు అందుబాటులో వున్నంతకాలం తను ఆమెను మార్చటానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేదనుకున్నాడు. ఆమెను జన సమ్మర్దంలేని ఏకాంత స్థలాలకు తీసుకువెళ్ళగలిగితే బాగుండు ననుకున్నాడు.

అతని కల నిజమయింది-అతని వాంఛ నెరవేరింది. ఒకరోజున సుబ్బారాయుడు అతనినొక వారం రోజులలో జానికమ్మతోను, సరోజతోను బయలుదేరి, ఆవేసంకాలం వాళ్ళ పొలాలు, యిళ్ళు వున్న పల్లెటూళ్ళో ఉండడానికి వెళ్ళమన్నాడు. ఆ వూళ్ళో పని చక్కబెట్టుకొని తనుగూడా వస్తానన్నాడు. తన కార్యదర్శి తనతోకూడావుంటే, యిన్నాళ్ళూ నెమ్మదిగా సాగుతున్న అతని పని అక్కడగూడా జరుగుతుందని అతని అభిప్రాయం.

రామదాసు తన గదిలోకి చాలా ఉత్సాహంగా వెళ్ళాడు. అతన్నిన్నాళ్ళూ శీతాకాలపు చలిగాలి కొరికేసింది. హృదయమంతా కరడుగట్టిపోయింది. ఈ వేసవికాలంలో అతని దేహం, హృదయం విశాలం చెందటానికి ప్రయత్నిస్తున్నాయి. రాజేశ్వరమ్మ కోరిక నెరవేర్చటానికి యీ అవకాశం వినియోగించుకో దలచుకున్నాడు.

ఆ మరుసటి వారం అతను సుబ్బారాయుడి ఎస్టేటులో గోదావరి నదిపక్క భవనాల్లో ఉన్నాడు.

(ఇంకా వుంది)

కొత్తపద్ధతులు

# నేర విచారణ

“రావు”

28-10-49

ఒక ఎల్లయ్య ఒక మల్లయ్యదగ్గిర డబ్బు కొట్టేశాడు. ఆ డబ్బుతో ఎల్లయ్య కొన్ని కొత్త గుడ్డలూ, ఇంటికి కావలసిన వస్తువులూ, తన చుట్టపక్కాలకు కొన్ని బహుమానాలూ కొన్నాడు. నలుగురు స్నేహితులకూ, బంధువులకూ షడ్రసోపేతంగా విందులూ అవీ చేశాడు.

ఎల్లయ్య తనదగ్గిర డబ్బు కాజేశాడని మల్లయ్య అధికార్లదగ్గిర ఫిర్యాదు చేశాడు. విచారణ చేయిస్తామన్నారు. కొన్ని మాసాలు గడిచాయి. విచారణ విషయమై అతీ గతీ లేదు.

ఈలోపుగా మల్లయ్యచేసిన ఫిర్యాదుగురించి దేశమంతా పాక్కింది. కొందరు స్నేహితులు ఎల్లయ్యతో అన్నారుకూడాను. కాని ఎల్లయ్య లక్ష్యపెట్టలేదు. అతను స్నేహితులతో అన్న మాటలు గమనించదగినవి

“నేను డబ్బు కొట్టేశానని మల్లయ్య రుజువు చెయ్యలేదు...ఆమాటకు వస్తే మల్లయ్యా చేతివాట్లు వేసినవాడే నంటాను.”

ఇంకా కొన్ని నెలలు గడిచాయి. ఈలోపల ఎల్లయ్య ఇంకాచాలాచోట్లచేతివాట్లువేస్తున్నట్లు పుకార్లు బయలుదేరాయి. ఎవరూ ముందుకు వచ్చి అధికార్లతో ఫిర్యాదు చేయలేదు. లోగడ మల్లయ్య చేసిన ఫిర్యాదు ఇంకా పెండింగులోనే ఉంది.

మల్లయ్య ప్రయాసపడి చేతివాట్ల జాబితా తయారుచేయ మొదలు పెట్టాడు. జాబితా ఏమో కొండవీటి చేంతాడల్లే పెరిగింది. ఈలోపుగా ఎల్లయ్యది నిత్యకల్యాణం పచ్చతోరణం. అంతా స్నేహితులే, అందరూ బహుమానాలు పొందినవారే, అందరూ విందులు కుడిచినవారే.

వాళ్ళు కూడా ఎల్లయ్యను మహాచమత్కారంగా సమర్థించారు. “సరే, బాగుందే! దొరికే దానిక్కూడా దొంగతనమేనా? అవసరం దొరికితే చేతివాటు వెయ్యని పవిత్రుడెవడు? అసలు మల్లయ్యకేదో పగలేనిదే ఎల్లయ్యమీద ధ్వజ

మెత్తుతాడా? తన విషయం తను చూసుకోక ఊళ్లోవాళ్ళ వ్యవహారాలన్నీ ఇతడి కేలా?"

తటస్థంగా ఉండేవాళ్ళు తటస్థంగా మాట్లాడారు.

"విన్నావుటోయ్?"

"మన కెందుకు పోనిస్తూ!"

"మల్లయ్య వన్నీ అబద్ధాలేనా?"

"లేకపోతే ఈయన పోయి చూసి వచ్చాడా? అయ్యా, చేతివాటు వేసేవాడు అందరూ చూసేలా వేస్తాడుటండీ?"

"మరెందుకీ మల్లయ్య అట్టహాసం?"

"వాళ్ళకీ వాళ్ళకీ ఏంలావాదేవీలున్నాయో?"

"అదీ నిజమేలే."

అందరూ మల్లయ్య ఆరోపణలు మరిచే సమయంలో విచారణ ఆరంభమై నలుగురికీ ఉత్సాహం కలిగించింది.

విచారణాధికారి ఎల్లయ్యగారింటికి వచ్చాడు. మల్లయ్యను పిలిపించాడు. ఆరోపణలు చెప్పమన్నాడు. మల్లయ్య కాగితం ఇచ్చాడు.

"ఇక నువు వెళ్ళవచ్చు" అన్నాడు విచారణాధికారి.

రెండుపూటలు విందు ఆరగించి విచారణాధికారి వెళ్ళాడు. విచారణ ఫలితానికి అతీగతీ లేదు. కొన్ని నెలలు గడిచాయి.

మల్లయ్య అధికార్లకు ఉత్తరం రాశాడు.

"విచారణాధికారి నివేదిక తయారు చేస్తున్నాడు" అని అధికార్లు సమాధానం రాశారు.

కొన్ని మాసాలు గడిచాయి. మళ్ళీ మల్లయ్య అధికార్లకు రాసుకున్నాడు.

"విచారణాధికారి నివేదిక తయారు చేశాడు. అందులో ఉన్న విషయాలు బయట పెట్టటానికి ఎంతమాత్రం వీలులేదు. అది రహస్య నివేదిక," అని జవాబు చెప్పారు అధికార్లు.

మల్లయ్య జీడీలాగా పట్టుకున్నాడు. పత్రికలకు సంపాదక లేఖలు వ్రాశాడు.

మల్లయ్యను అధికార్లు ఆరోపణలతోనూ సాక్ష్యంతోనూ బయలుదేరి రమ్మన్నారు. మల్లయ్య వెళ్లాడు.

"ఇందులో ఉన్న ఆరోపణలు ఉపసంహరించుకుంటే విచారణ జరపటానికి అభ్యంతరం లేదు" అన్నారు అధికార్లు.

"విచారణ జరిపి తీరాలిసిందే" అన్నాడు మల్లయ్య.

"ఎల్లయ్యా నువ్వూ రాజీపడమని మా సలహా."

"ఏ విషయమై రాజీపడం?" అన్నాడు మల్లయ్య.

"మీ ఇష్టం!"

"విచారణ జరిగి తీరాలిసిందే", అన్నాడు మల్లయ్య.

"సరే విచారణ జరుపుతాం. నువ్వు వెళ్లు" అన్నారు అధికార్లు.

మరొక విచారణాధికారి వచ్చాడు. ఇది నిజమైన విచారణ అయి ఉండాలి.

ఈయన కేమీ తెలీకపోవటం చేత "రెడ్డొచ్చె మొదలాడె" అయింది. మల్లయ్యతో మాట్లాడి విచారణాధికారి ఎల్లయ్యతో కూడా ఏదో మాట్లాడి వెళ్ళిపోయాడు.

కొంతకాలానికి అధికార్ల వద్దనుండి ఉత్తరం వచ్చింది మల్లయ్యకు.

"నువు చేసిన ఆరోపణల్లో నూటికి 19 పాళ్లు విచారణాధికారి విశ్వసించ లేదు. ఆయన కా ఆరోపణలు అసభ్యంగా ఉన్నాయి. మిగిలిన వాటిలో నూటికి 35 పాళ్లు రుజువు కాలేదు. సాక్ష్యం ఏమీ లేదు. మిగిలినవాటిల్లో నూటికి 90 పాళ్లు ఎల్లయ్య ఖండించాడు. అవి పచ్చి అబద్ధాలు. మూడు ఆరోపణలను మాత్రం ఎల్లయ్య స్వయంగా ఆమోదిస్తున్నాడు. వాటికి కారణాలున్నాయి. అవి బహిరంగ పరచటానికి వీలులేదు. అవి బహిరంగపరిస్తే దేశంలో శాంతి భద్రతలకు అపాయం వాటిల్లుతుంది."

మల్లయ్యకు ఏం చేయాలో తోచలేదు.

"శ్రీ ఎల్లయ్యగారి మీద అక్రమ ఆరోపణలు చేసినందుకు నన్ను విచారించి శిక్షించ వలసినదిగా విజ్ఞాపన చేసుకుంటున్నా", అని మల్లయ్య అధికార్లకు ఉత్తరం వ్రాశాడు.